శృంగార వీధి

# కౌగిలిగింత

విఠ్ఠలయ్యకి చెప్పరానంత కోపంగావుంది. రెండు వారాలు గడిచిపోయినా, పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాదయ్యె! తనేమో ఈ విద్యానగరం విడిచి పోదామంటే, రానున్న దసరా వేడుకల సందర్భంగా జరిగే సైనికవిన్యాసాలలో పాల్గొనడానికి తన 'గుల్మం' సైన్యానికి శిక్షణ ఇవ్వాలాయె! (గుల్మం అంటే : 9 రథాలు, 9 ఏనుగులు, 45 మందికాలిబంట్లు, 29 గుర్రాలు ఉండే ఒక దళం).



కొత్తగా పెళ్లయింది. వకుళ చాలా అందమైన పిల్ల. వెన్నెల్లో మెరిసే వెండి గంధపుగిన్నెలాగ ఘుమఘుమలాడుతూ నట్టింట మసలుతూంటే, మన్మథుడికి సైతం గుండె ఝల్లుమనవలసిందే!

విఠలయ్య వీరసైనికపదవిలో వున్నా, వకుళను చూస్తే చాలు... రెప్పలార్పలేడు. కాలు కదపలేడు. ఇక ముట్టుకుంటేనా! నిప్పులమీద వెన్నలాగ ... బెట్టుమాని, కరిగిపోతాడు.

అసలీ కోపానికి వెనక కథ ఏమంటే : పాదాలకు పెట్టుకునే వెండి మువ్వల పట్టాలతో ముడిపడివుంది.

అలవాటుగా - ఒకనాటి ఉదయం కలవరపడుతూ నిద్రలేచింది వకుళ. కలవరం ఎందుకంటే, పొద్దెక్కింది. వేణుగోపాలస్వామి ఆలయం తోట పక్క కోనేటికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకోవాలి. పొద్దెక్కేకొద్దీ రేవులో జనం పెరుగుతారు. పొద్దెక్కి ఎందుకులేవవలసి వచ్చిందంటే : విఠలయ్యే! కౌగిలి సడలిస్తేనా? గింజుకుని, రక్కి, మొహం గంటు పెట్టుకుని అల్లరిచేస్తే తప్ప వదలలేదు.

సరే వదిలేడయ్యా! - గబగబ ఇంటిపనులు పైపైగా కొంతవరకు పూర్తిచేసుకుని బిందె పట్టుకుని బయలుదేరింది. కోనేటికి వెళ్లాలంటే తోటలో నుంచే కాలిబాట - కొంచెం పొద్దెక్కడంవల్ల చురుకు సూర్యకిరణాలున్నా, ఆకుపచ్చని తోటలో పూలపరిమళాలు నిండిన చల్లని గాలి ఝల్లుమనేలాగ వొంటిని నిమురుతూవుంటే, నిద్రమత్తు ఎగిరిపోయి గబగబ నడుస్తోంది వకుళ. అప్పటికే కొందరు తమ వీధి ముత్తైదువలు ద్రావిడ ప్రబంధాలు మననం చేసుకుంటూ తోటదారిలో ఇళ్లకి తిరిగి వెడుతున్నారు.

వాళ్లని చూడగానే వకుళకి మరీ కంగారెక్కువైంది. గబగబ కోనేటికి వెళ్లి స్నానం పూర్తిచేసుకుని తడిగా మడిబట్టలతోనే బిందెనిండా నీళ్లు ముంచింది. ఇంతలో... అల్లంత దగ్గరలో రెండు కమలాలు బాగా విచ్చి మిలమిలలాడిపోతూ ఆకర్షించడంతో... రెండడుగులు మళ్లీ నీళ్లలోకే వేసి, ఒక్క బార ఈది, వాటినందుకుని, తూళ్లు తురిమి, పూలుకడిగి బిందెలో పడేసి... మెట్టుమీదికి ఎక్కి బిందె బుజానికెత్తుకుంది. నడుస్తోంది. బిందెలో పూలుకూడా వయ్యారంగా వూగుతున్నాయి.

సరిగ్గా తోటమధ్యకు వచ్చేసరికి ఎదుట విఠలయ్య! కొంటెగా నవ్వుతూ దగ్గరకొచ్చాడు.

వస్తే... ఏంచేస్తాడో తనకి తెలుసు. కోపంగా చుట్టూ చూసింది. ఎవరూ దరిదాపుల్లో లేరు. విఠలయ్యని చూపులతోనే గట్టిగా మందలించ బోయింది.అతను చిరునవ్వు చెదరనీయకుండానే దగ్గరకొచ్చి, బిందెలో పూలుతీసి, వదులుముడి వేసుకున్న ఆమె తడిజుట్టులో తురిమి కౌగిలించుకున్నాడు. వకుళ విసురుగా తప్పించుకుని బిందె అక్కడే పడేసి కాళ్లు విదిలించి నేలమీద కొడుతూ విసవిసా రుసరుసా వెళ్లిపోయింది.

విఠలయ్య పకపక నవ్వేసి బిందె తీసుకుని కోనేటిలో స్నానంచేసి బిందెతో సహా ఇల్లుచేరాడు.

చేరడం తరువాయి! వకుళ మంచినీళ్ల బిందె అందుకోవడం కూడా మరిచిపోయి... "నాకాలి మువ్వపట్టా దొరికిందా?" అంది ఆందోళనగా. విఠలయ్య మాట్లాడకుండా బిందె వంటఇంట దించి - "ఏ పట్టా?" అన్నాడు.

"అదే... ఇందాక... ఆ తోటలో... మీవల్లే పోయింది..''

"అదా! అది నాకు కనబడలేదే!''

"కళ్లు పెట్టుకుచూస్తే సరి!"

"చూస్తున్నాను కనకనే కనబడలేదు.''

"చూడవలసింది నన్ను కాదు.''

"ఏది ఎప్పుడు ఎక్కడ చూడాలో నాకు బాగా తెలుసు.''

వకుళకు ఒళ్లు మండిపోయింది. ఆనాటి సాయంకాలమే పుట్టింటికి వెళ్లిపోయింది.

అందుకే... విఠలయ్యకి చాలా కోపంగా వుంది. తిరిగిరమ్మని బతిమాలుతూ పల్లకీ పంపితే తిప్పి కొట్టింది...

అందుకే... వారం గడిచింది... రెండోవారం కూడా గడిచింది.

ఈ సాయంకాలం మహాతిక్క పుట్టుకు వచ్చింది విఠలయ్యకి.

ఇవాళ రాత్రి తప్పుదారి తొక్కేద్దామనుకుంటూండగా...

పల్లకి వచ్చి వాకిట్లో నిలిచింది. చికిలీ చేసిన మన్మథబాణంలాగ నవ్వుకుంటూ వకుళ ఇంట్లోకి వచ్చింది.

విఠలయ్యకి కోపం పెరిగిపోయింది. అతని ధోరణి చూసి వకుళకూడా కనుబొమలు ముడుచుకుని ఇంటి పడకటింటిలోకి వెళ్లిపోయింది.

రాత్రి పడింది. అలవాటుగా భోజనమూ పూర్తయింది. మంచానికి అడ్డంగాపడి నిద్రపోతున్న వకుళను బలవంతంగా పక్కకు జరిపి - పక్కనే పడుకున్నాడు విఠలయ్య.

పక్కనుంటే చాలు '63' అంకెలాగ ఎదురెదురు కౌగిలితప్ప ఎరగని ఆ దంపతులు, ఎడమొగం పెడమొగంగా '36' అంకె మాదిరి పడుకున్నారు.

అర్ధరాత్రి... జాములు గడుస్తూండగా... పక్కనున్న వేణుగోపాలస్వామి ఆలయం గోడమీదకి ఆనుకునివున్న సంపంగి చెట్టుమీద నిద్రపోయే పక్షులు 'కిచకిచ'మేలుకొన్నాయి.

విఠలయ్యా, వకుళా కూడా మేలుకొన్నారు. అమ్మో! తెల్లారిపోతోందే అన్న గాభరాతో విఠలయ్య వకుళ పాదాలమీద పడ్డాడు. ఆమె పాదాలు వెనక్కి లాక్కోబోయి చూసుకుంటే... తన పాదాలకు బంగారు మువ్వలపట్టాలు మిలమిల మెరిశాయి.

అంతే... 36గావున్న జంట, 63గా మారి కౌగిలిలో కరిగిపోయింది...

ఇంతకీ... అప్పుడు నిజంగా తెల్లవారుజాము కాలేదు. అర్ధరాత్రే! తెల్లారిపోతుందనే ఆత్రంతో దంపతులు అలకలు మాని కౌగిళ్ల కరగడాన్ని కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యద కావ్యంలోని ఒక పద్యంలో మహాపసందుగా చెప్పాడు -

మలయపుగాలి రేలు వనమాలి
విమానపతాక ఘల్లుమం
చులియ, పసిండి మువ్వగమి
నొక్కొకమాటు గదల్ప, నుల్కి మి
న్నలము తదీయ హేమవరణాంచల
చంపకశాఖలందు ప
క్షులు రొదసేయ వేగె నని కూడుదు
రల్కలు దీరి దంపతుల్.

అసలేం జరిగిందంటా?

వేణుగోపాలస్వామి ఆలయధ్వజస్తంభం గంటలు, దక్షిణపు గాలివాటుకి గలగల మోగిపోతే, ఉలిక్కిపడి లేచిన, సంపంగి చెట్టుకొమ్మల మీది పిట్టలు 'కిచకిచ' లాడిపోయాయి.

ఈ కిచకిచలు నూతనదంపతుల కిలకిలలుగా పరిణమించాయి!!

Ⓟ